మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



ఆహార శుద్ధి యూనిట్‌లో యువతితో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్, పక్కన ఎమ్మెల్యే వినోద్

నెన్నెల, న్యూస్‌టుడే: మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి మహిళా శక్తి పథకంలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి పథకాలలో భాగంగా వ్యవసాయ యంత్ర పనిముట్ల కేంద్రం, వెంకటేశ్వర మందుల దుకాణం, ఆహార శుద్ధి యూనిట్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందుతాయని అన్నారు. సాహితి అనే యువతి తెలుగు రుచుల పేరుతో నిర్వహిస్తున్న ఆహారం శుద్ధి కేంద్రం ద్వారా సుమారు 50 దేశాలకు ఇక్కడి వంటకాలు పంపించడం అభినందనీయమన్నారు. అక్కడ తయారు చేస్తున్న ఉత్పత్తులను ఎమ్మెల్యే, పాలనాధికారి పరిశీలించారు. అనంతరం చిత్తాపూర్ గ్రామ సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులతో మాట్లాడారు. ఘన్‌పూర్, ఆవడం పాఠశాలలో ప్రహరీ నిర్మాణం పనులు ప్రారంభించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ మురళి, డీపీఎం వేణుగోపాల్ ఏపీఎం విజయలక్ష్మి, ఎంపీడీఓ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య శనివారం అండర్-17 బాలికల విభాగంలో జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా ప్రకటనలో తెలిపారు. తాండూరు మండలం అచ్చులాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు 01-01-2008 తర్వాత జన్మించి ఉండాలన్నారు.

ఈనాడు మంచిర్యాల

శనివారం అక్టోబరు 19, 2024

రాసుంటే మంత్రి పదవి వస్తుంది : ఎమ్మెల్యే

● గొడవలకు కారణం గత పాలకులే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాల అర్బన్, న్యూస్‌టుడే: రాసుంటే తనకు మంత్రి పదవి వస్తుందని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. కాగా కొద్ది రోజులుగా చోటుచేసుకుంటున్న గొడవలకు గత పాలకులే కారణమని ఆరోపించారు. శుక్రవారం తన ఇంట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యువతకు మత్తుపదార్థాలు అలవాటు చేసి జిమ్‌లలో నేరాలకు ప్రణాళికలను రూపొందించి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేశారని.. దీనికి సంబంధించి త్వరలో ఆధారాలతో నిరూపిస్తానన్నారు. ఇటీవల జరిగిన కేసులలో అరెస్టు అయిన భారాస, భాజపా నాయకుల మోసాలు బహిర్గతమయ్యాయని పేర్కొన్నారు. తన ఇంట్లోకి ముసుగులు వేసుకొని వచ్చి వాచ్‌మెన్‌ను బెదిరిస్తే తను భయపడనన్నారు. మంచిర్యాల జిల్లాతో పాటు కుమురంభీం, ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం కోసం రూ.350 కోట్లతో 650 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలలో రహదారుల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరయ్యాయన్నారు.

నేడు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

ఏసీసీ, న్యూస్‌టుడే : జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ మంచిర్యాల డివిజన్ ఈఈ కె.మధుసూధన్ ప్రకటనలో పేర్కొన్నారు. వాటర్ గ్రిడ్‌లో తలెత్తిన సమస్య కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలోని దండేపల్లి, లక్షెట్టిపేట, మంచిర్యాల, హాజీపూర్, చెన్నూరు నియోజకవర్గంలోని మందమర్రి, భీమారం, కోటపల్లి, చెన్నూరు మండలాలతో పాటు మంచిర్యాల, చెన్నూరు, మందమర్రి, క్యాతన్‌పల్లి, నస్పూర్ పురపాలిక ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

నైపుణ్యమే అధనం..

చదువులో రాణించాలన్నా.. ఉద్యోగం సాధించాలన్నా నైపుణ్యం ఒడిసిపట్టాల్సిందే. విద్యార్థి జీవితంలో ఇంటర్ తర్వాత వేసే ప్రతి అడుగు అత్యంత కీలకం. ఈ దశలో రూపుదిద్దుకున్న తీరు ఉన్నతి వైపు నడిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దేందుకు టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్) కృషి చేస్తోంది. అవకాశాలు కోల్పోతున్న యువతలో అత్యున్నత నైపుణ్య వికాసంపై శిక్షణ ఇస్తోంది. సాధారణ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా వివిధ రంగాల్లో రాణించేందుకు వారి భవితకు చేయూతనిస్తోంది.

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే

● టాస్క్ శిక్షణతో ఉద్యోగావకాశాలు



ఉద్యోగాలకు ఎంపికైన పలువురు విద్యార్థులు



యువతలో నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగ సాధనకు మార్గాన్ని సులువుగా చేయడమే లక్ష్యంగా టాస్క్ ముందుకు సాగుతోంది. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఫార్మసీ, ఎంబీఏ ఇతర విద్యను అభ్యసించే విద్యార్థులకు వివిధ అంశాల్లో తర్ఫీదు అందిస్తోంది. టాస్క్‌లో నమోదు చేసుకోవడం ద్వారా నైపుణ్య అంశాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు వివిధ సందర్భాల్లో సంస్థలు, పరిశ్రమల సహకారంతో నిర్వహించే ఉద్యోగ మేళాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. తెలంగాణ అకాడమీ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో గత ఏప్రిల్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో పలువురు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గత విద్యాసంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 45 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల నమోదు ప్రక్రియ చేపట్టగా 1400 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆయా కళాశాలల్లో టాస్క్ శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

వివిధ అంశాలపై...

కళాశాల స్థాయిలో 40 నుంచి 50 మందిని బ్యాచ్‌లుగా విభజిస్తారు. ప్రతి విద్యార్థికి అర్థమెటిక్ అండ్ రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్, ఒక సాంకేతిక కోర్సు బోధిస్తారు. ప్రముఖ కార్పొరేట్, ఐటీ కంపెనీలకు క్షేత్ర స్థాయి పర్యటనలకు తీసుకెళ్తారు. సామర్థ్యాలను పరీక్షించి ప్రతిభ ఆధారంగా ధ్రువపత్రాలు అందిస్తారు. ఉద్యోగ నియామకాల సమయంలో టాస్క్ ధ్రువపత్రానికి ప్రాధాన్యమిస్తారు.



మంచిర్యాల సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో టాస్క్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

మెలకువలు నేర్పించారు



సాక్షి అగర్వాల్, మంచిర్యాల

డిగ్రీలో చేరగానే టాస్క్‌పై అధ్యాపకులు అవగాహన కల్పించడంతో ప్రవేశం పొందా. ఉద్యోగ నైపుణ్య మెలకువలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మేళాలో పాల్గొని ఇంటర్వ్యూని ధైర్యంగా ఎదుర్కొని స్థానిక పిరమల్ క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం సాధించా.

శిక్షణతో ఆత్మస్థైర్యం పెరిగింది



డి. లహరి, మంచిర్యాల

టాస్క్ శిక్షణలో ఉద్యోగానికి అవసరమైన మెలకువలు నేర్పించారు. సంస్థలు నిర్వహించే ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలు వివరించారు. వ్యక్తిత్వ వికాసం నైపుణ్యాలపై పట్టు సాధించా. డిగ్రీ పూర్తికాగానే ప్రాంగణ నియామకాల్లో ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగం లభించింది.

మంచి అవకాశం



బి.దీపరెడ్డి ఉమ్మడి జిల్లా టాస్క్ రిలేషన్‌షిప్ మేనేజర్

టాస్క్ ద్వారా వివిధ కోర్సుల్లో అవగాహన కల్పిస్తూనే ఉపాధి పొందేందుకు సాయం అందిస్తున్నాం. ముందే రూపొందించుకున్న కార్యాచరణను పక్కాగా అమలు చేస్తున్నాం. అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ పలు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం. ప్రస్తుత సంవత్సరం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది.

45 ఉమ్మడి జిల్లాలో టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న కళాశాలలు మొత్తం | డిగ్రీ కళాశాలలు 35 | పాలిటెక్నిక్ 6 | పీజీ 3 | ఇంజినీరింగ్ 1 | 1150 గతేడాది నమోదు చేసుకున్న విద్యార్థులు | 256 ఉద్యోగాలకు ఎంపికైనవారు

ఎటూ తేల్చరు..
ఆదాయం సమకూర్చరు

● దుకాణాల పన్ను వసూళ్లపై రాని స్పష్టత



సింగరేణి అప్పగించిన దుకాణాలు

న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం

అసలే పాలకవర్గం లేదు. ఆపై నిధులు పెద్దగా సమకూరని పరిస్థితి. దీనికి తోడు ఏజెన్సీ చట్టం కారణంగా స్థలాలు, నిర్మాణాల క్రయవిక్రయాలకు ఇక్కడ అవకాశం లేదు. ఈ క్రమంలో పురపాలికలో మౌలిక సదుపాయాల కల్పన భారంగా మారింది. ఇదే సమయంలో మార్కెట్‌లో కీలకంగా ఉన్న 79 దుకాణాల పన్ను వసూళ్లపై స్పష్టత రాకపోవడంతో ఎనిమిదేళ్లుగా లక్షల రూపాయల ఆదాయానికి గండిపడుతోంది.

మూడో గ్రేడ్‌గా కొనసాగుతున్న మందమర్రిలో 24 వార్డుల్లో 13,315 గృహాలు ఉన్నాయి. ఇందులో 8 వార్డుల్లో 3500 సింగరేణి క్వార్టర్లు ఉన్నాయి. ఇందుకు గాను ఏటా రూ.31 లక్షలను పురపాలికకు చెల్లిస్తోంది. మిగిలిన వార్డుల్లో ఇళ్లకు పురపాలిక అధికారులు వసూళ్లు చేస్తున్నారు. ఇవేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, తైబజార్ వేలం, నల్లా పన్నుల వసూళ్లు, ట్రేడ్ లైసెన్స్, ప్రకటనల బోర్డులు తదితర ద్వారా పురపాలికకు మొత్తంగా సుమారు రూ.2.27 కోట్లు ఆదాయం సమకూరుతుంది.

వేతనాలకే సరిపోతుంది

ఇక్కడ 63 మంది ఒప్పంద కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. వారికి ఏటా వేతనాలు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ చెల్లింపుల ద్వారా రూ.1.75 కోట్లు చెల్లిస్తున్నారు. మిగిలిన రూ.52 లక్షలు పుర వాహనాల డీజిల్, వాహనాల నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర ఖర్చులకే సరిపోతున్నాయి. ఇతర ఖర్చుల కోసం డబ్బు కావాలంటే ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



మార్కెట్ ప్రాంతంలో నిర్మించిన భవనాలు

జోరుగా భవన నిర్మాణాలు

దుకాణాల వ్యవహారం ఎటూ తేలకముందే జోరుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. కొందరు వ్యాపారులు పాత వాటిని కూల్చి వేస్తూ అక్కడ కొత్తగా మొదటి, రెండు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. ఇలా పలువురు భవనాలు నిర్మించారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పురపాలిక, సింగరేణి అధికారులు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

పుర ఆదాయానికి గండి

మందమర్రి పురపరిధిలో 364 దుకాణాలు ఉన్నాయి. వాటి ద్వారా ఏటా రూ.4.61 లక్షలు ఆదాయం సమకూరుతుంది. ఎనిమిదేళ్ల క్రితం సింగరేణి ఆధీనంలో ఉన్న 162 ఎకరాల స్థలాన్ని రెవెన్యూశాఖకు అప్పగించారు. ఈ స్థలంలో ఏళ్ల క్రితం సింగరేణి నిర్మించి వ్యాపారులకు ఇచ్చిన సుమారు 79 దుకాణాల ఆస్తి పన్నుపై మాత్రం స్పష్టత రాకపోవడంతో అయోమయం నెలకొంది. దీంతో పుర అధికారులు పన్ను వసూళ్లు చేయడం లేదు. ఇలా ఏటా సుమారు రూ.20 లక్షల చొప్పున ఎనిమిదేళ్లలో రూ.1.40 కోట్లకు పైగా పురపాలిక ఆదాయానికి గండి పడింది.



తాండూరులో వరి సాగులో ఉన్న క్రీడాప్రాంగణం



ఆకెనపల్లిలో శ్మశానవాటిక పక్కనే ఇలా..

క్రీడా ప్రాంగణాలు.. నిర్లక్ష్యపు ఆనవాళ్లు

న్యూస్‌టుడే, బెల్లంపల్లి గ్రామీణం

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పల్లెల్లో నిర్మించిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడింది. అడవుల్లో, పంటచేలల్లో, చెరువుల్లో స్థలాలను చూపి రెవెన్యూశాఖ చేతులు దులుపుకొంది. మైదానాల్లో అమర్చిన క్రీడా పరికరాలను సైతం దొంగిలించారు.



బుచ్చయ్యపల్లిలో సామగ్రి లేని వైనం

పంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో నిర్మించిన గ్రామీణ క్రీడాప్రాంగణాలపై అధికారులు పర్యవేక్షణ కొరవడింది. ఆర్భాటంగా ప్రారంభించి యంత్రాంగం చేతులు దులుపుకొంది. రూ.లక్షలు విలువ చేసే సామగ్రి నిరుపయోగంగా మారింది. మంచిర్యాల జిల్లావ్యాప్తంగా 311 పంచాయతీల్లో సుమారుగా 480 వరకు క్రీడాప్రాంగణాలను నిర్మించి సామగ్రిని అందించారు. యువతను క్రీడల వైపు మళ్లించడం, ఆటల్లో రాణించే గ్రామీణ క్రీడాకారులను గుర్తించడానికే అయినా ప్రయోజనం శూన్యం. బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూరు నియోజకవర్గాల్లో సగానికి పైగా పనికిరాకుండానే ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాల్సి ఉన్నా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

బెల్లంపల్లి నియోజకవర్గంలోని బెల్లంపల్లి, కాసిపేట, నెన్నెల, భీమిని, వేమనపల్లి, తాండూరు మండలాల్లోని 114 పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. వీటిలో కొన్ని ఊరికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో, అటవీ భూముల్లో నిర్మించారు. బెల్లంపల్లి మండలంలోని ఆకెనపల్లిలో గ్రామానికి దూరంగా నిర్మించడం, శ్మశానవాటిక ఒకే ప్రాంగణంలో ఉండటంతో పాటు వాగు అడ్డుగా ఉంది. ఇక్కడికి వెళ్లాలంటేనే స్థానికులు జంకుతున్నారు. బుచ్చయ్యపల్లిలో స్థల వివాదం ఉండటంతో పాటు ఏర్పాటు చేసిన క్రీడాపరికరాలను ఎత్తుకెళ్లారు. తాండూరులో వివాదాస్పద స్థలంలో ఏర్పాటు చేయడంతో సామగ్రిని తొలగించారు. అంతేకాకుండా కొందరు వ్యక్తులు వరిని సాగు చేస్తున్నారు. కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి పంచాయతీలోని దాంపూర్ క్రీడాప్రాంగణ స్థలంలో పత్తిని సాగుచేస్తున్నారు.

స్థల కేటాయింపుల్లో అలసత్వం

ఆర్భాటంగా ప్రారంభించిన పంచాయతీ అధికారులు, స్థలాల ఎంపికపై అలసత్వం వహించారు. స్థలాలను సేకరించి ఇచ్చిన రెవెన్యూ అధికారులు, వారికి సరైన ఆధారాలు ఇవ్వకపోవడంతో పంటలు సాగు చేసుకుంటున్నారు. పలు పంచాయతీల్లో దాతలు ఇచ్చిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రూప్-2, 3 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు



వీసీలో పాల్గొన్న కలెక్టర్, సంబంధిత అధికారులు

ఏసీసీ, న్యూస్‌టుడే : జిల్లాలో గ్రూప్-2, 3 పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి శుక్రవారం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఏర్పాట్ల గురించి వివరించారు. నవంబరు 17, 18, డిసెంబరు 15, 16వ తేదీల్లో జరిగే పరీక్షలకు 15 వేల మంది అభ్యర్థులకు గానూ 48 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరీక్షల నిర్వహణకు ప్రత్యేకాధికారులను నియమించనున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, పోలీస్ నోడల్ అధికారి సుందర్‌రావు, రీజినల్ కోఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేకులషెడ్డుకే వైకుంఠ రథాలు పరిమితం



మంచిర్యాల పుర పాలక సంఘంలో వైకుంఠ రథాల(వాహనాలు) వినియోగంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా ఇవి నిరుపయోగంగా మారాయి. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌ను సంప్రదించగా పురపాలికలో ఉన్న మూడు వైకుంఠరథాలను మతాలతో సంబంధం లేకుండా ఎవరు చనిపోయినా వారి అంత్యక్రియలకు పంపిస్తామని ఇటీవలనే నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకు నిరుపయోగంగా ఉన్న వైకుంఠ రథాలను ఇకముందు వాడతామని వివరించారు. **మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే**

పాడికి ప్రోత్సాహకం..
లక్ష్యం దూరం

● ఉమ్మడి జిల్లాలో మూడు పాల శీతలీకరణ కేంద్రాల పరిస్థితి



న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం

పాడి రైతును ప్రోత్సహించేలా వారి నుంచి మద్దతు ధరకు పాలు కొనుగోలు చేసి విక్రయించేందుకు ప్రభుత్వం పాల శీతలీకరణ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతన్నల కోసం ఆదిలాబాద్ పట్టణంలో తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య కార్యాలయాన్ని ఏర్పాటుచేసి ఇక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తోంది. కొనుగోలు చేసిన పాలను ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ వసతిగృహాలు, కస్తూర్బాలు, గురుకులాలకు ప్యాకెట్ల రూపంలో సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 2021లో మూడుచోట్ల రూ.18 కోట్లతో అందుబాటులోకి తెచ్చిన ఈ కేంద్రాల్లో పరికరాలు భారీ వ్యయంతో ఏర్పాటు చేసినా డిమాండ్‌కు తగ్గ పాలు సరఫరా కావడం లేదు. గతంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదిలాబాద్‌లోని ఈ పాల కేంద్రంలో 2 వేల లీటర్ల కంటే ఎక్కువ పాలు కొనుగోలు చేసేవారు కాదు. ప్రస్తుతం ఉన్న అధికారుల చొరవతో ఇది మూడింతలు దాటింది. కానీ ఈ కేంద్ర సామర్థ్యానికి ఉన్న లక్ష్యం ఎప్పటికీ నెరవేరదనడంలో సందేహం లేదు.

◆ మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో రూ.6 కోట్లతో 20 వేల లీటర్ల పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ 6 వేల నుంచి 7 వేల లీటర్ల కంటే ఎక్కువ పాలు రావడం లేదు. ఫలితంగా 10 వేల లీటర్ల సామర్థ్యంలో ఉన్న స్టోరేజీ ట్యాంకులు రెండు నిరుపయోగంగా ఉంటున్నాయి.

◆ నిర్మల్ జిల్లా సోఫీనగర్‌లో రూ.3 కోట్లతో 10 వేల లీటర్ల సామర్థ్యంతో 2021లోనే పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ పరికరాలు, స్టోరేజీ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. పరికరాలు అధ్వానంగా ఉండడంతో ఈ కేంద్రాన్ని మూసివేశారు. రైతుల కోసం అక్కడే రూ.50 లక్షల వ్యయంతో కొత్తగా కేంద్రాన్ని ఏర్పాటు చేసి నెట్టుకొస్తున్నారు.

ఈ మూడు కేంద్రాల కోసం రూ.14.60 కోట్లు, ఇతర ఖర్చులకు మరో రూ.3.40 కోట్లు.. మొత్తం కలిపి రూ.18 కోట్లు వెచ్చించారు. కానీ ప్రయోజనం అంతంతమాత్రమే.

ఆదిలాబాద్ పట్టణం గాంధీ పార్కు పక్కన పాల శీతలీకరణ కేంద్రంలో మూడేళ్లుగా ఉపయోగంలోకి రాని స్టోరేజ్ ట్యాంకులివి. ఒక్కో ట్యాంకు సామర్థ్యం 10 వేల లీటర్లు. రెండు ట్యాంకులు కలిపి 20 వేల లీటర్ల వరకు పాలు నిల్వ చేయొచ్చు. ఇదే కేంద్రంలో 5 వేల లీటర్ల ట్యాంకు మరో రెండు, చిన్న ట్యాంకులు మరో మూడు ఉన్నాయి. మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. ఇక్కడ మొదటి నుంచి రైతులు పాలు విక్రయించేందుకు అంతగా రావడం లేదు. కానీ రూ.5.60 కోట్లతో 20 వేల లీటర్లకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన యూనిట్‌ను ఏర్పాటు చేశారు. అధికారులు కష్టపడి ప్రస్తుతం 7 వేల నుంచి 8 వేల లీటర్ల వరకు రోజూ కొనుగోలు చేస్తున్నారు.



విక్రయాలు పెరిగాయి..

- మధుసూదన్, డెయిరీ డిప్యూటీ డైరెక్టర్

రైతులకు పాలలో వెన్న ఆధారంగా చెల్లింపులు చేస్తున్నాం. ప్రస్తుతం సరాసరి లీటరుకు రూ.55 నుంచి రూ.60 వరకు అందిస్తున్నాం. 50 శాతం రాయితీపై పశు దాణా, పశువులలో పాల ఉత్పత్తి పెంచేందుకు 32 రకాల లవణాలు ఉండే మినరల్ మిక్చర్ తక్కువ ధరకు ఇస్తున్నాం. గడ్డి విత్తనాలు తక్కువ ధరకే అందిస్తున్నాం. ప్రోత్సాహకాలు అందించడంతో గతంలో కంటే పాల విక్రయాలు పెరిగాయి.

నేడు జిల్లా స్థాయి సైన్సు సెమినార్

మంచిర్యాల విద్యావిభాగం : ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు శనివారం జిల్లా స్థాయి సైన్సు సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. సైన్సు సెంటర్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పొటెన్షియల్ అండ్ కన్సర్న్ అనే అంశంపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు.

అభిరుచి.. ఆచరించి



ప్రపంచంలో ఎత్తయిన లెటర్ బాక్సు వద్ద ప్రణయ్‌కుమార్

జిల్లా కేంద్రానికి చెందిన బి.ప్రణయ్‌కుమార్ ఫొటోగ్రఫీ వృత్తిలో కొనసాగుతున్నారు. ఆయనకు ద్విచక్ర వాహనంపైన సాహసోపేత ప్రయాణం చేయడం అభిరుచి. ఇప్పటికే ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ప్రదేశాలు లద్దాఖ్‌లోని ఉమ్‌లింగ్‌లా, ఖార్దుంగ్‌లా పర్వత ప్రాంతాలను సందర్శించారు. ఈ నెల 11న ఆదిలాబాద్ నుంచి బయలుదేరిన ఆయన తాజాగా హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం స్పితి జిల్లాలోని హిక్కిం గ్రామాన్ని 16న చేరుకున్నారు. అక్కడ ప్రపంచంలోనే ఎత్తులో ఉన్న తపాలాశాఖకు చెందిన లెటర్ బాక్సు(సముద్ర మట్టం నుంచి 14,400 అడుగుల ఎత్తు), ఇదే జిల్లాలోని కాజా వద్ద ప్రపంచంలోనే ఎత్తులో ఉన్న పెట్రోల్ పంపును(సముద్ర మట్టం నుంచి 12,270 అడుగుల ఎత్తు) దర్శించుకున్నారు. ఈ క్రమంలో 2,567 కి.మీ.లు బైక్‌పైన ప్రయాణించానని, మరో అయిదు రోజుల్లో ఆదిలాబాద్ చేరుకుంటానని ఆయన 'న్యూస్‌టుడే'కు ఫోన్‌లో వివరించారు.

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం

ఈ పత్రాలే ఆధారం.. ప్రయోజనాలు అపారం

న్యూస్‌టుడే, చెన్నూరు గ్రామీణం : మనకు తోడుగా కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఉంటారు. వారికి మించి మన వెంట ఉండాల్సినవి ధ్రువీకరణ పత్రాలు. మనిషి పుట్టుక నుంచి మొదలుకొని మరణం వరకు వీటి అవసరం వెలకట్టలేనిది. దైనందిన అవసరాల్లో జీవితాంతం బాసటగా నిలిచే వీటిని పొందడంలో ఏమాత్రం అలసత్వం చేయకూడదు.



ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు చెన్నూరులోని మీసేవలో దరఖాస్తు సమర్పిస్తున్న తల్లిదండ్రులు

ఆధార్

ప్రస్తుత పరిస్థితుల్లో ఆధార్‌కార్డు లేకుండా ఏ పని జరగదు. బ్యాంకు ఖాతా తెరవాలన్నా.. సిమ్‌కార్డు పొందాలన్నా ఇది తప్పనిసరి. ప్రభుత్వ పథకాలను పొందాలంటే ఆధార్ ఉండాల్సిందే.

✷ **పొందే విధానం:** పిల్లలకు ఆధార్‌కార్డు తీసుకోవాలంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ఆధార్ జారీ చేసే కేంద్రాలకు వెళ్లి జనన ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత దరఖాస్తు ఫారాన్ని ఇవ్వాలి. నిర్వాహకులు పిల్లల ఫొటో, ఇతర వివరాలను తీసుకొంటారు. వారం, పదిరోజుల్లో ఆధార్‌కార్డు పొందవచ్చు.



పాన్‌కార్డు



పాన్‌కార్డు లేకుండా ప్రస్తుతం ఏ బ్యాంకూ రుణం ఇవ్వడం లేదు. ఆదాయ పన్ను చెల్లింపులో ఇది ఎంతో కీలకం. గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుంది. మన ఖాతాలు, రుణాలు, ఆర్థిక పరిస్థితులు దీని ద్వారా తెలుస్తాయి.

✷ ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫొటోలతో ఆన్‌లైన్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే పక్షం రోజుల్లో తపాలాశాఖ ద్వారా పాన్ కార్డు వస్తుంది. పాన్‌కార్డు పోతే ఆధార్ కార్డు ద్వారా తిరిగి పొందే అవకాశం ఉంటుంది.

ఓటరు గుర్తింపు పత్రం



భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పిస్తోంది. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఇది అవసరం.

దరఖాస్తు ఇలా : వయసును నిర్ధారించే ఏదైనా ధ్రువీకరణ పత్రంతో ఒక పాస్‌ఫొటో, ఫారం-6ని పూర్తిచేసి ఆన్‌లైన్ కేంద్రాలతో పాటు చరవాణిలో మై ఓటర్‌యాప్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మరణ ధ్రువీకరణ..



ఒక వ్యక్తికి సంబంధించిన ఆస్తి, ఆర్థిక, బీమా, తదితర ప్రయోజనాలను ఆ కుటుంబసభ్యులు పొందాలంటే మరణ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. గ్రామాల్లో అయితే పంచాయతీ కార్యదర్శి, పట్టణాలు, నగరాల్లో పురపాలికలు, కార్పొరేషన్ల ద్వారా తీసుకోవచ్చు.

✷ మరణించిన వ్యక్తి ఆధార్‌కార్డు, అతని పాస్‌ఫొటో, ఒక ప్రభుత్వ ఉద్యోగి ష్యూరిటీ తీసుకోవాలి. దరఖాస్తు చేసే కుటుంబసభ్యుడి ఆధార్‌కార్డుతో మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేస్తే విచారణ అనంతరం జారీ చేస్తారు.

జనన ధ్రువీకరణ ఇలా..

శిశువు పుట్టిన తర్వాత వారి పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి. ఇది వయసును నిర్ధారించే ధ్రువీకరణ పత్రం. పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించాలంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి.

✷ ఆసుపత్రుల్లో జన్మించిన పిల్లల వివరాలను ఆసుపత్రి నిర్వాహకులే స్థానిక సంస్థల కార్యాలయాలకు అందజేస్తారు. తల్లిదండ్రులకు సైతం శిశువు జన్మించిన పత్రం అందజేస్తారు. దీంతో స్థానిక సంస్థల రిజిస్టర్‌లో నమోదైన సంఖ్యను తీసుకొని సంబంధిత ఫారాన్ని పూర్తిచేయాలి. తల్లిదండ్రుల పేర్లు, శిశువుకు పెట్టిన పేరును రాసి మీసేవలో దరఖాస్తు చేస్తే నాలుగైదు రోజుల తర్వాత జనన ధ్రువీకరణపత్రం అందుతుంది.



డ్రైవింగ్ లైసెన్స్



ఇది లేకుండా వాహనాలు నడపొద్దు. తోడుగా లేకపోతే వాహనాల తనిఖీల సందర్భంగా జరిమానా విధిస్తారు. ప్రమాదాలు జరిగినపుడు ఎలాంటి బీమా వర్తించదు.

✷ వయసు నిర్ధారణ పత్రంతో పాటు ఆధార్‌కార్డు, చరవాణి నంబరుతో సంబంధిత ఫారాన్ని నింపి ఆన్‌లైన్‌లోనే రుసుం చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న తేదీన రవాణా శాఖ అధికారి(ఆర్టీవో) కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. కార్యాలయంలో ఫొటో తీసుకున్న తర్వాత మొదట లెర్నింగ్ లైసెన్స్ ఇస్తారు. నెల నుంచి ఆరునెలల లోపు తిరిగి స్లాట్‌బుక్ చేసుకొని రవాణా శాఖ అధికారి (ఆర్టీవో) కార్యాలయానికి వెళ్తే పరీక్ష నిర్వహిస్తారు. అందులో ఉత్తీర్ణత సాధిస్తే డ్రైవింగ్ లైసెన్స్ జారీ అవుతుంది.

పేరు తప్పు రాకుండా చేసుకోవాలి

మీ దగ్గర అన్ని కార్డులు ఉండొచ్చు, కానీ వాటిల్లో ఏమాత్రం పేరు తప్పు దొర్లినా ఆ కార్డు నిరుపయోగమే అవుతుంది. అన్నికార్డుల్లో, బ్యాంకు ఖాతాల్లో పేర్లు ఒకే రకంగా ఉండాలి. జనన ధ్రువీకరణపత్రం లేదా పదోతరగతి మెమోలో ఉన్న పేరులో ఏవైతే అక్షరాలు ఉన్నాయో అవే ఉండేలా చూసుకోవాలి.

దండారీ ఉత్సవాలకు సన్నద్ధం..



నెమలి ఈకల టోపీని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్న యువకులు

దీపావళి పండగ సమీపిస్తుందంటే ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో సందడి మొదలవుతుంది. ఆదివాసీలు ఎంతో పవిత్రంగా భావించే ఈ పండగ సందర్భంగా తండాల్లో దండారీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడమే కారణం. పండగకు మూడు రోజుల ముందే భోగీ నిర్వహించిన తర్వాత ఆదివాసీ వాయిద్యాలైన డోల్, డోల్కీ, వెట్టె, తబలా, సూర్నా, డప్పులు, నెమలి ఈకలకు ప్రత్యేక పూజలు చేస్తారు. పండగ రోజు ఏత్మసూర్ పేన్ (శివుడు-విష్ణు-బ్రహ్మ), ఇతర దేవతల వేషాలతో గుస్సాడీలుగా అలంకరించుకుని ఆక్డా దేవతకు పూజలు చేసి గుస్సాడీ దండారీ వేడుకలు నిర్వహిస్తారు. నెమలి ఈకలతో టోపీ తయారు చేసి ఉత్సవాల్లో నృత్యాలు చేయడం ఇక్కడి ప్రత్యేకత. ఈక్రమంలో పక్షం రోజుల ముందు నుంచే నెమలి ఈకలను సేకరించి టోపీలు తయారు చేయడంలో పెద్దలు నిమగ్నమవుతుంటారు.

- న్యూస్‌టుడే, నార్నూర్

సృజనాత్మకత చాటి.. జాతీయస్థాయిలో మెరిసి



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: చదివేది తొమ్మిదో తరగతే అయినా.. తనలోని ప్రతిభతో జాతీయస్థాయి పోటీల్లో రాణించింది. తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచింది. ఫెయిర్‌గేజ్ ద్వారా ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన పోటీల్లో ఆమె నగదు బహుమతికి ఎంపికవడం విశేషం. వివరాలిలా ఉన్నాయి. స్థానిక వేదం గ్లోబల్ పాఠశాలకు చెందిన చిన్నోల్ల ప్రశస్తిని ఇండియా యాజ్ ఐ సీ-2024 పోటీలో భాగంగా 'పవిత్ర స్వేచ్ఛ' అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో ఉత్తమంగా నిలిచింది. సృజనాత్మకతను చాటుతూ ఆమె రాసిన వ్యాసం మూడోస్థానం దక్కించుకుంది. ఈ మేరకు నిర్వాహకులు రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థ ఇండియా ఈజ్ అస్ భాగస్వామ్యంతో జరిగిన ఈ పోటీ విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు, నాటి పోరాటయోధుల జీవిత విశేషాలను తెలియజేయడానికి, స్వేచ్ఛ-స్వాతంత్ర్యం విలువ చాటిచెప్పడమే లక్ష్యంగా సాగింది. దేశవ్యాప్తంగా వందలాది మంది పోటీపడిన కాంపిటీషన్‌లో నిర్మల్ జిల్లా విద్యార్థిని తృతీయస్థానంలో నిలవడంపై కలెక్టర్ అభిలాష అభినవ్ అభినందించారు. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన విద్యార్థినితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ భూపాల్, ఉపాధ్యాయురాలు ప్రవళిక పాల్గొన్నారు.

నూతన కోర్సుల ఏర్పాటుకు కృషి




భోజనశాలలో భోజనం చేస్తున్న ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీలో సాంకేతిక విద్యతోపాటు నూతన కోర్సుల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ చెప్పారు. తొలిసారి విశ్వవిద్యాలయానికి వచ్చిన ఆయనకు పరిపాలన విభాగం అధికారి రణధీర్, ఆయా విభాగాల అధ్యాపకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయా విభాగాల అధ్యాపకులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆర్జీయూకేటీ పరిస్థితి, విద్యార్థుల వివరాలు, విభాగాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎవరికీ చెప్పకుండా నేరుగా భోజనశాలకు వెళ్లి భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం వంటగది, సరకులను పరిశీలించారు. వంటగది అపరిశుభ్రంగా ఉండటంతో శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఆయా విభాగాలకు వెళ్లి అధ్యాపకులతో మాట్లాడారు. వారి సమస్యలను స్వయంగా చూశారు. ఇక్కడ పనిచేసి బయటకు వెళ్లిన అధ్యాపకులు, సిబ్బందికి ఇచ్చిన గదులను వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.

ఆర్జీయూకేటీని అగ్రగామిగా తీర్చిదిద్దుతా

'న్యూస్‌టుడే'తో ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్

ముఖాముఖి



ముథోల్(బాసర), న్యూస్‌టుడే:

విద్యార్థుల అసౌకర్యాలను, విద్యాపరంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ ఆర్జీయూకేటీని అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ చెప్పారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం బాసర ఆర్జీయూకేటీకి వచ్చారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆయా విభాగాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలపై 'న్యూస్‌టుడే' ఉపకులపతితో ముఖాముఖి నిర్వహించింది.

? విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటి పరిష్కారానికి ఏం చర్యలు చేపట్టబోతున్నారు?

ఇక్కడ సమస్యలను పరిష్కరించడానికి నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించారు. తొలుత విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తాను. మిగతా వాటిని దశల వారీగా తీర్చడానికి కృషి చేస్తా. అయితే ఇందుకు కొంత సమయం పడుతుంది. విశ్వవిద్యాలయాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి శాయశక్తులా పాటుపడుతాను.

? విద్యార్థుల ఉద్యమం ఫలితంగానే మీ నియామకం జరిగిందనే దానిపై మీ స్పందనేమిటి?

ఇక్కడి సమస్యలను తీర్చే బాధ్యతలు నాకు అప్పగించారు. నమ్మకంతో పనిచేస్తాను. ఆకస్మిక తనిఖీలు చేపడుతాను. తప్పిదాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాను. ఇక్కడికి రాగానే నేరుగా భోజనశాలకు వెళ్లి విద్యార్థులతో కలిసి భోజనం చేశాను. పరిస్థితులు గమనించాను. అన్ని విభాగాలను పరిశీలించి సలహాలు, సూచనలను అందజేస్తాను. ఏ సమస్య ఉన్నా విద్యార్థులు నన్ను నేరుగా కలవొచ్చు. లేదంటే చరవాణిలో చెప్పొచ్చు.

? నాలుగేళ్లుగా ఏకరూప దుస్తులు, ల్యాప్‌టాప్‌లు, బూట్లు అందజేయడం లేదు.

ఇది ఆర్థికపరమైన సమస్య. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది.

? విద్యార్థి సంఘం కార్యవర్గానికి ఆమోదం తెలపడం లేదని గతంలో ఆందోళన చేశారు. దీనిపై మీ వైఖరి ఏమిటి?

నేను విద్యార్థుల మధ్యనే ఉంటాను. వారికే సమస్య వచ్చినా అండగా ఉండి పరిష్కరిస్తాను. సంఘం విషయంలో విద్యార్థులను పిలిచి మాట్లాడతాను.

? ఉపకులపతులు హైదరాబాద్ నుంచి పర్యవేక్షణ చేస్తారనే విమర్శలు ఉన్నాయి..?

నేను ఎక్కువ సమయం బాసరలోనే ఉంటాను. విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి సమయం కేటాయిస్తాను. వారి ఇక్కట్లను గమనించి తీర్చే యత్నం చేస్తాను. నేను కూడా వసతి గృహాల్లోనే ఉండి చదువుకొని ఉన్నతోద్యోగం చేస్తున్నాను. సమస్యలపై అవగాహన ఉంది.

? ఆరువేల మంది విద్యార్థినులకు ఆరుగురే కేర్‌టేకర్లు ఉన్నారు. వీరి సంఖ్య పెంచుతామని చెప్పినా ఆచరణలోకి రాలేదు?

ఈ సమస్య నా దృష్టికి వచ్చింది. దీనిపై సమీక్ష సమావేశంలో చర్చిస్తాం. ఏ విధంగా నియామకాలు చేపట్టాలన్న దానిపై ప్రభుత్వానికి నివేదిక అందజేసి సాధ్యమైనంత త్వరగా చర్యలు చేపడతాం.

? అందరూ తాత్కాలిక అధ్యాపకులే.. అందులోనూ సగానికి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భర్తీకి ఏం చేస్తారు?

బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీల వివరాలు సేకరించాను. వాటిపై ఉన్నతాధికారులతో మాట్లాడతాను. సాధ్యమైనంత త్వరగా ముఖ్యమైన పోస్టుల భర్తీకి ప్రయత్నాలు చేస్తాను.

నలుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు

● 900 కిలోల గంజాయి కేసులో సూత్రధారులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద గత నెలలో రూ.2.25 కోట్ల విలువైన 900 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. అప్పుడు 8 మందిపై కేసు నమోదు చేశారు. ఐచర్ కంటైనర్ డ్రైవర్ వసీం, క్లీనర్ అర్మాన్‌లను అదే రోజు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలో వారిని శుక్రవారం అరెస్టు చేశారు. గ్రామీణ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. సెప్టెంబరు 20న ఆంధ్రా - ఒడిశా సరిహద్దు నుంచి మహారాష్ట్రకు ఐచర్ వాహనంలో గంజాయిని ఆదిలాబాద్ మీదుగా తరలిస్తున్నారు. ఐచర్ వాహనంలో డ్రైవర్ వసీం, క్లీనర్ అర్మాన్ ఉన్నారు. వీరికి ఎస్కార్ట్‌గా వ్యాన్‌లో ముగ్గురు శుభం సాబ్లె, అమర్‌సింగ్, సోమనాథ్ ఉన్నారు. పోలీసులను చూసి వారు పరారయ్యారు. వీరు మహారాష్ట్రలోని బుల్డాన, జెల్గాన్ జిల్లాలకు చెందిన వారు. ప్రత్యేక పోలీసు బృందం వారిని అక్కడ అరెస్టు చేశారు. వీరితో పాటు వ్యాపారి గోతిరాం గురుదయాళ్‌సాబ్లెను కూడా అరెస్టు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ మొత్తంలో మొదటిసారి గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారులైన ఒడిశాకు చెందిన అశీష్, పండిత్, సోనూ అన్సారీ, అన్షుజైన్, మరి కొంత మందిని పట్టుకునే వరకు ప్రత్యేక బృందం కార్యాచరణ కొనసాగిస్తుందన్నారు. ఈ కేసులో కృషి చేసిన జైనథ్, ఆదిలాబాద్ గ్రామీణ సీఐలు సాయినాథ్, ఫణిదర్‌తో పాటు గ్రామీణ ఎస్ఐ ముజాహిద్, సిబ్బంది రుక్మారెడ్డి, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది, తదితరులను జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించినట్లు పేర్కొన్నారు.



☛ ఈయన పేరు టేకం లక్ష్మణ్(22). ఉట్నూరు మండలం బొప్పరికుంట గ్రామం. రెండు నెలల కిందట ఉట్నూరు నుంచి గ్రామానికి వెళ్తుండగా రహదారికి అడ్డంగా ఉన్న వాగులో గల్లంతై మృత్యువాతపడ్డాడు. ఏటా వాగులు దాటుతూ ప్రాణాలు కోల్పోతున్నా.. వాగులపై వంతెనలు నిర్మించడం, రహదారులను బాగు చేయడం మాత్రం కరవైంది.



☛ కొన్నేళ్ల కిందట వంకతుమ్మ(ఏ) గ్రామానికి చెందిన కొడప ఎత్మాబాయికి పురిటినొప్పులు రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్దామంటే గ్రామం నుంచి వెళ్లే మార్గంలోని వాగుపొంగి ప్రవహించింది. గ్రామస్థులు ఎన్ని ప్రయత్నాలు చేసినా సఫలం కాలేదు. ఎత్మాబాయి మృతి చెందిందని ఆమె తల్లి సాక్రుబాయి బోరుమంది.



గోరియగూడ, పరందోలి, మహరాజ్‌గూడ గ్రామాలకు వెళ్లాలంటే ఈ వాగు కష్టాలు తప్పవు

☛ కుమురం భీం జిల్లా కెరమెరి మండలం లక్మాపూర్, గోరియగూడ, పరందోలి, మహరాజ్‌గూడ, మకద్దంపూర్, కొలాంగూడ గ్రామాల్లో 1500 మందికిపైగా నివసిస్తున్నారు. ఈ గ్రామాలకు వెళ్లే మార్గమధ్యలో లక్మాపూర్, గోరియాగూడ వాగులు ప్రవహిస్తున్నాయి.

జాలి కాదు.. దారి చూపండి!

● గ్రామీణుల ని'వేదన'..

న్యూస్‌టుడే, ఉట్నూరు



ప్రమాదకరంగా మారిన వాగును పరిశీలిస్తున్న ఎస్ఐ మనోహర్, పోలీసుల బృందం

భారీ వర్షాలు కురవగానే.. వాగులు పొంగి అనేక గ్రామాలలో రహదారులు ముంపునకు గురవుతున్నాయి. గ్రామస్థులకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగి వాగులు దాటే క్రమంలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదకరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సమస్యను చూసి ప్రజాప్రతినిధులు, అధికారులు జాలి చూపడం తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదనే విమర్శలొస్తున్నాయి.

వర్షాకాలం వచ్చిందంటే గిరిజన ప్రాంతాల్లో వాగులు పొంగి ప్రవహిస్తూ.. రాకపోకలు నిలిచిపోతున్నాయి. గూడేలు, తండాలలోని గర్భిణులు ప్రసవ వేదన, అనారోగ్యం, అత్యవసర పరిస్థితి ఏదైనా సాహసం చేయాల్సిందే. అన్ని సందర్భాల్లో ప్రాణాలు దక్కుతాయనే ఆశలేదు. వాగుల కారణంగా అనేక గిరిజన గ్రామాలకు '108' వంటి అత్యవసర వాహనాలు వెళ్లలేకపోతున్నాయి. విషజ్వరాలు, ప్రసవ వేదనతో సకాలంలో ఆసుపత్రికి చేరలేక మృత్యువాత పడుతున్నారు. వాగులపై వంతెనలను నిర్మిస్తేగానీ ప్రాణాలకు భరోసా ఉండదు.

☛ ఇంద్రవెల్లి మండలం మామిడిగూడ, దుబ్బాగూడ గ్రామాలకు వెళ్లే మార్గమధ్యలో వడ్‌గావ్, ముత్నూర్ వాగులు వస్తాయి. వానాకాలంలో వాగులు పొంగి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. వీటితో పాటు గోపాల్‌పూర్, కన్నాపూర్‌తండ, జైత్రంతండా, డొంగర్‌గావ్‌లలో రేషన్ బియ్యం కూడా తెచ్చుకోలేని పరిస్థితి.

అనుమతుల పేరిట..



నర్సాపూర్(జే) గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో వాగు


ఉట్నూరు నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉండే వంకతుమ్మ(ఏ), వంకతుమ్మ(బి) గ్రామాలకు వెళ్లడానికి కనీసం రోడ్డులేదు. గతంలో ఉపాధి హామీ పథకంలో తాత్కాలికంగా మొరం రోడ్డు వేశారు. వర్షానికి అది కొట్టుకుపోయింది. మార్గమధ్యలో రెండు వాగులు ప్రవహిస్తున్నాయి.

రెండు గ్రామాల్లో 700 జనాభా ఉంటుంది. 108, 104 వెళ్లలేని పరిస్థితి. ఇలా వైద్యం అందక ఈ గ్రామాలలో చాలా మంది మృత్యువాతపడ్డారు. వంకతుమ్మ(ఏ) గ్రామానికి, నర్సాపూర్(జే) గ్రామాలకు ఈ సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం బీటీ రహదారిని మంజూరు చేసినా అనుమతుల పేరిట పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు.

రేపు ఉమ్మడి జిల్లా ఖోఖో ఎంపిక పోటీలు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామంలోని లిటిల్ స్కాలర్స్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉమ్మడి జిల్లా ఖోఖో బాలబాలికల జూనియర్స్ విభాగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగ్రత్ ఈశ్వర్, ఎన్.శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఆసక్తిఉన్న క్రీడాకారులు ఉదయం 10 గంటలకు తమ ఆధార్, బోనఫైడ్ ధ్రువపత్రం, పదో తరగతి మెమోతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సురేశ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాకేశ్‌కు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఈ నెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. 22.11.2006 తర్వాత జన్మించిన వారై ఉండాలని, వివరాల కోసం చరవాణి 93984 30685లో సంప్రదించాలని వివరించారు.

కుంటాల ఏఓగా విక్రమ్



కుంటాల, న్యూస్‌టుడే: కుంటాల వ్యవసాయాధికారిగా దిలారి విక్రమ్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఉద్యోగ విధుల్లో ఇటీవల నూతనంగా చేరారు. ఇప్పటి వరకు భైంసా అర్బన్ ఏఓ ఆసం రవి అదనపు బాధ్యతలు చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

న్యూస్‌టుడే, చెన్నూరు

? పట్టణంలోని ఆస్నాద రోడ్డు మార్గంలోని పంచముఖాంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న వీధిలో భగీరథపైపులు చెడిపోయి రంగుమారిన నీరు సరఫరా అవుతోంది. - కార్తీక్, స్థానికుడు

✓ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం. - గంగాధర్, పురపాలిక కమిషనర్, చెన్నూరు

మాజీ వైస్ ఎంపీపీపై యువకుల దాడి


శ్రీనివాస్‌ను బలవంతంగా లాక్కెళ్తున్న పోలీసులు


చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే : హాజీపూర్ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్‌పై రాపల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, యువకులు దాడికి పాల్పడ్డారు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో రాపల్లి ఆర్ అండ్‌ఆర్ కాలనీ వద్ద శ్రీనివాస్ పాత కక్షలను మనసులో పెట్టుకొని గ్రామస్థులైన తంగెళ్ళ రమేష్, దెనవేణి రాజశేఖర్, తంగెళ్ళ సాగర్‌లపై ఇనుపరాడ్డుతో దాడి చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ప్రతి దాడిలో శ్రీనివాస్‌కు గాయాలైనట్లు ఆయన పేర్కొన్నారు. ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పోలీసుల అత్యుత్సాహం..

గాయాలపాలైన మందపల్లి శ్రీనివాస్ పట్టణంలోని స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో పాటు భారాస శ్రేణులు శుక్రవారం మధ్యాహ్నం ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ తరుణంలోనే శ్రీనివాస్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు ఆసుపత్రికి రావడంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఎస్సైలు సుగుణాకర్, సురేష్‌లతో మాట్లాడుతున్నప్పటికీ వారు బలవంతంగా శ్రీనివాస్‌ను వాహనంలో తరలించారు.

సమాజ హితులు... మనసున్న మారాజులు

సామాజిక కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్న యువకులు

న్యూస్‌టుడే, లక్షెట్టిపేట :

కుర్రకారు అనగానే కార్లు, షికార్లు, షికార్లకు పరిమితం అనేది సమాజంలో బలంగా నాటుకుపోయింది. అలాంటిది సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు లక్షెట్టిపేట మండలానికి చెందిన పలువురు యువకులు. రూ.లక్షల సంపాదన ఉండే ప్రభుత్వ, కార్పొరేటు ఉద్యోగాలు చేయకున్నా... ఆర్థికంగా పెద్దగా స్థితివంతులు కాకపోయినా... తమకు ఉన్న దానిలో ఎంతో కొంత సమాజ హితానికి ఖర్చు చేస్తూ మనసున్న మారాజులుగా అందరి అభినందనలు అందుకుంటున్నారు.

మిత్రుడి జ్ఞాపకార్థం బస్ షెల్టర్ నిర్మాణం


మిత్రులు నిర్మించిన బస్ షెల్టర్


బస్ షెల్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మిత్ర బృందం

లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బోడకుంటి మహేష్ అనే యువకుడు అనారోగ్యంతో మృతి చెందాడు. మహేష్ జ్ఞాపకార్థం ఏదైనా చేయాలన్న ఉద్దేశంతో అతని మిత్రులంతా ఆలోచించి గ్రామ కూడలి వద్ద బస్సు షెల్టర్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. మొత్తం 23 మంది మిత్రులు రూ.2,500 చొప్పున వేసుకుని నిర్మించాలని సంకల్పించారు. మొత్తం రూ. 80 వేల ఖర్చు రాగా వారి వారి ఆర్థిక పరిస్థితుల ఆధారంగా డబ్బులు జమ చేసి నిర్మాణం పూర్తి చేశారు. అనంతరం మహేష్ తండ్రి రవి చేతుల మీదుగా బస్ షెల్టర్‌ను ప్రారంభించారు.

వాట్సాప్ మిత్రులు... సేవాతత్పరులు


వెంకట్రావుపేట గ్రామానికి చెందిన రాజన్నకు శస్త్ర చికిత్స కోసం రూ. 5 వేల నగదు అందజేస్తున్న వాట్సాప్ మిత్రులు

సామాజిక మాధ్యమాలను సేవా కార్యక్రమాలకు కూడా వినియోగించవచ్చని నిరూపించారు లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బియ్యాల దినేష్. 'వాట్సాప్ మిత్రులు' పేరిట నిధులు సేకరించి అవసరార్థులు, అభాగ్యులకు సేవ చేయాలన్న సంకల్పంతో చేసిన ఆలోచన ఇది. తన చరవాణిలో కాంటాక్ట్‌లో ఉన్న దాదాపు 3 వేల మందిలో కొందరైనా స్పందించినా తన లక్ష్యం నెరవేరుతుందన్న ఆలోచనతో చేసిన ప్రయత్నం సత్ఫలితాలను ఇస్తోంది. 15 రోజులకు ఒకసారి అవకాశం ఉన్న వారు రూ.25 చొప్పున నెలకు కనీసం రూ.50 అందజేయాలనేది లక్ష్యం. ప్రతి నెల రెండు దఫాలుగా డబ్బుల కోసం అప్పీలు చేస్తారు. అలా వచ్చిన డబ్బులతో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

నస్పూర్, న్యూస్‌టుడే : నస్పూర్ విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని నస్పూర్ విద్యుత్తు శాఖ ఏఈ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. పురపాలికలోని అన్ని వార్డుల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

బెల్లంపల్లి పట్టణం : శివాలయం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌ఛార్జి ఏడీఈ రామ్‌మనోహర్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని బెల్లంపల్లిబస్తీ, మహ్మద్‌ఖాసింబస్తీ, బూడిదగడ్డబస్తీ, షంషీర్‌నగర్, హన్‌మాన్‌బస్తీ, ఏఎంసీ ఏరియా, అశోక్‌నగర్, శాంతిఖని, సుభాష్‌నగర్, 65 డీప్, బూధఖుర్దు, చాకెపల్లి, బూదకలన్, చంద్రవెల్లి, బట్వాన్‌పల్లి, పెర్కపల్లి, లంబడితాండ గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

తాండూరు: తాండూరు, రేచిని సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ జాన్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు బోయపల్లి, చౌటపల్లి, తాండూరు, ఐబీ, కొత్తపల్లి, రేపల్లెవాడ, మాదారం, కాసిపేట, చంద్రపల్లి, ద్వారకాపూర్, అబ్బాపూర్, బెజ్జాల, నర్సాపూర్, రేచిని, అచ్చలాపూర్, గోపాల్‌నగర్, కొమ్ముగూడెం గ్రామాల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

భీమారం : భీమారం విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 గం.ల నుంచి మధ్యాహ్నం 1 గం వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నామని ఏఈ శంకర్ తెలిపారు

రామకృష్ణాపూర్ : క్యాతనపల్లి పురపరిధిలోని రామకృష్ణాపూర్, అమరవాది, గద్దెరాగడి, తిమ్మాపూర్‌లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రభాకర్ తెలిపారు.

చెన్నూరు : చెన్నూరు 132/కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో భీమారం, కోటపల్లి మండలాల్లో 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

మంచిర్యాల పట్టణం : హాజీపూర్ మండలంలోని గుడిపేటలో విద్యుత్తు ఉప కేంద్రం మరమ్మతుల కారణంగా గుడిపేట, నమ్నూరు, చందనాపూర్, ముల్కల్లలో 9.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని ఏఈ మహేందర్ తెలిపారు.

జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


అండర్-17 బాలుర జట్టు..


ఎంపికైన బాలికల జట్టుతో వ్యాయామ ఉపాధ్యాయులు, నిర్వాహకులు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికల జిల్లా స్థాయి జట్ల ఎంపికను శుక్రవారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆయా క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. మెరుగైన ఆటతీరును కనబరిచిన వారిని జోనల్ స్థాయికి ఎంపిక చేశారు. పోటీల నిర్వాహకుడు గోపాల్, హెచ్‌సీఏ శిక్షకుడు ప్రదీప్, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి రామ్మోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు డిమాండ్

బెల్లంపల్లి పట్టణం : ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని తిలక్‌స్టేడియం నుంచి కాంట చౌరస్తా వరకు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు అల్లి సాగర్, సబ్బని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పనుల పూర్తికి ఆదేశాలు

ఏసీసీ : ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనుల పురోగతి వివరాల నివేదికను అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

వ్యాసం రాసి.. ప్రతిభ చాటి





మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తూ వారి ఆలోచన విధానాలకు పదును పెట్టేలా 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మిమ్స్ హై స్కూల్‌లో ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ అనుభవాలను వ్యక్తపరిచారు. అనంతరం ఉత్తమంగా నిలిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు టి.హర్షిణి(9వ), ఎం.సహస్ర(10వ), ఎం.హర్షిణి(10వ)లకు ప్రిన్సిపల్ సంగీత, పాఠశాల ఇన్‌ఛార్జి అక్బర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేర వార్తలు

కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య


లింగయ్య

దండేపల్లి, న్యూస్‌టుడే : కాసీపేటకు చెందిన చిరుత లింగయ్య (44) కడుపు నొప్పి భరించలేక శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. లింగయ్యకు రెండేళ్ల క్రితం కాలేయం చెడిపోయి అనారోగ్యం బారిన పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స అందించడంతో కొంత కోలుకున్నాడు. కాగా వారం నుంచి విపరీతమైన కడుపు నొప్పి వచ్చింది. ప్రైవేటులో చూపించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో స్థానిక వైద్యులను సంప్రదించాడు. అయినా నొప్పి తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై ఉదయం పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం లక్షెట్టిపేటకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి లోయలో పడ్డ కారు

రామకృష్ణాపూర్ : కారు అదుపుతప్పి లోయలో పడ్డ ఘటన శుక్రవారం క్యాతనపల్లి పురపరిధిలోని అమరవాది చెరువు సమీపంలో జరిగింది. రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన కిరణ్ శ్రీరాంపూర్ వైపు నుంచి వస్తున్న క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో పక్కన ఉన్న లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

జూదరుల అరెస్టు

దండేపల్లి, న్యూస్‌టుడే : దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండాల వెళ్లే రహదారి సమీపంలో రహస్యంగా జూదం ఆడుతున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై ఉదయ్‌కిరణ్ పేర్కొన్నారు. మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ఎస్సై లచ్చన్న సిబ్బందితో స్థావరంపై దాడి చేయడంతో నలుగురు పట్టుబడ్డారు. నాలుగు చరవాణులు, మూడు ద్విచక్రవాహనాలు, రూ.53,460 స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు పరారయ్యారని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుడుంబా పట్టివేత

మందమర్రి పట్టణం: మందమర్రిలో రైల్వే ట్రాక్ మీదుగా శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రెండు వందల గుండుబా పొట్లాలను తరలిస్తున్న వినోద్, రాజశేఖర్‌లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

మోసం చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష

మంచిర్యాల న్యాయవిభాగం, న్యూస్‌టుడే : మంచిర్యాలకు చెందిన నారాయణ అనే వ్యక్తి గౌతమినగర్‌కు చెందిన ఓ మహిళను భూ విషయంలో మోసం చేసినందుకు రెండేళ్ల జైలు శిక్ష రూ.5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం మంచిర్యాల మొదటి అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఉపనిషద్విని తీర్పునిచ్చారు. నారాయణ 2012 జనవరి 31న పగిడి లక్ష్మి-మునిరాజు దంపతులకు భూమిని అమ్మి డబ్బులు తీసుకొన్నాడు. అనంతరం మునిరాజు చనిపోగా భూ యజమాని రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో తనను మోసం చేశాడని లక్ష్మి మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపారు. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాక్ష్యులను ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో న్యాయమూర్తి పై మేరకు తీర్పునిచ్చారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ



బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : బెల్లంపల్లి 363 జాతీయ రహదారి డివైడర్‌ను శుక్రవారం లారీ ఢీకొట్టింది. మంచిర్యాల వైపు వెళుతున్న లారీ ముందు టైరు పగలడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. డ్రైవర్ చాకచక్యంతో అదుపు చేయడంతో బోల్తా పడలేదు.

మహిళ ఆత్మహత్యాయత్నం

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : బెల్లంపల్లిలోని తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్ కూడలి వద్ద శుక్రవారం ఓ మహిళ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఎస్సై రమేష్ కథనం మేరకు.. బెల్లంపల్లి మండలం పెర్కపల్లికి చెందిన మహిళ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ కలహాలపై ఫిర్యాదు చేయడానికి వచ్చింది. ఆమె భర్త దాడిచేయడంతో పెట్రోలు పోసుకుంది. పోలీసులు గమనించి మహిళను వెంటనే ఆసుపత్రికి తరలించారు. సదరు మహిళ పలుమార్లు ఆమె భర్తపై ఫిర్యాదు చేయగా కేసు నమోదైనట్లు తెలిపారు. కాగా అతడికి ఇద్దరు భార్యలు.

దీర్ఘకాలిక రోగులకు చికిత్స అందేలా చర్యలు

దండేపల్లి, న్యూస్‌టుడే : దీర్ఘకాలిక వ్యాధులతో ఇంటి వద్ద చికిత్స పొందుతున్న వారిని గుర్తించి వీరికి వైద్యం అందేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని పాలియేటివ్ కేర్ జిల్లా ప్రోగ్రాం అధికారులు డా.ప్రసాద్, డా.శివప్రతాప్ సూచించారు.. ఉపశమన సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బందికి దీర్ఘకాలిక రోగులను ఉపశమనం కలిగించేలా వైద్యం అందించాల్సిన చర్యలపై స్థానిక వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ఫ్లెక్సీలు, గోడప్రతులను ఆవిష్కరించారు.

సన్న రకాలకు బోనస్ అందిస్తాం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్, పాలనాధికారి కుమార్‌దీపక్

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : సన్నరకాలు సాగుచేసే రైతులకు రూ.500 బోనస్ అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి మండలం చాకెపల్లి గ్రామంలో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చంద్రవెల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు లేకుండా కేంద్రాల నిర్వహణ చేస్తామన్నారు. గన్నీ సంచులు, తాగునీరు, టార్పాలీన్లు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. జిల్లాలో ట్యాగింగ్ చేసిన రైస్‌మిల్లులకు సామర్థ్యాన్ని బట్టి తరలిస్తామన్నారు. ధాన్యం కొనుగోలుకు, తరలింపునకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తామన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, శ్రీకళ, బెల్లంపల్లి తహసీల్దార్ జ్యోత్స్న, చంద్రవెల్లి సహకార సంఘం ఛైర్మన్ స్వామి పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు, సంఘీభావం తెలుపుతున్న సీపీఎం పార్టీ నాయకులు

జన్నారం, న్యూస్‌టుడే : తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ ఉద్యమ కారులు పాదయాత్ర చేపట్టారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌లోని ఆర్ట్స్ కళాశాల వరకు ఈ నెల 15న ప్రారంభమై 29న ముగియనుంది. ఈ మేరకు శుక్రవారం పాదయాత్రకు జన్నారంలో సీపీఎం పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. సీపీఎం నాయకులు లింగన్న, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నవంబరులో జిల్లా స్థాయి సైన్సు ప్రదర్శనలు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : నవంబర్ చివరి వారంలో జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల ప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రధానంశంగా ఆహారం ఆరోగ్యం, శుభ్రత, రవాణా మరియు కమ్యూనికేషన్స్, సహజ వ్యవసాయం, విపత్తు నిర్వహణ, గణిత నమూనా, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ అనే ఉప అంశాలపై ఆరు నుంచి 12వ తరగతి విద్యార్థులకు బాలవైజ్ఞానిక ప్రదర్శన పోటీలు ఉంటాయన్నారు. 2023-24 సంవత్సరానికి గానూ జిల్లాలో 149 ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికైన ప్రాజెక్టులకు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలు జరుగుతాయన్నారు.

మద్యం గొలుసు దుకాణాల నిర్వహణకు వేలం

జైపూర్, న్యూస్‌టుడే : మండలంలోని కుందారం గ్రామంలో మద్యం దుకాణం లేకపోవడంతో గ్రామస్థులు కొందరు బెల్టుషాపులు పెట్టుకోవడానికి వేలం నిర్వహించినట్లు సమాచారం. ప్రభుత్వంలో నాయకులు మద్యపాన నిషేధానికి ప్రతిజ్ఞలు చేస్తుంటే కుందారంలో ఇందుకు విరుద్ధంగా లేని మద్యం దుకాణాన్ని బెల్టు దుకాణాల రూపంలో అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. దసరా పండుగ పురస్కరించుకుని మద్యం నిర్వహణకు గ్రామంలో రెండు బెల్టుషాపులు ఏర్పాటు చేసుకోవడానికి బహిరంగ వేలం నిర్వహించారు. రూ.7.40లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

'మత్తడి పేల్చివేతలో ప్రమేయం లేదు'

చెన్నూరు, న్యూస్‌టుడే : చెన్నూరు పట్టణంలోని శనిక్కుంట చెరువు మత్తడి పేల్చివేత ఘటనలో తన ప్రమేయం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొడిశెల బాపురెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. చెరువు సమీపంలో తాను భూమి కొనుగోలు చేశానని, అది ఎఫ్‌టీఎల్‌లో ఉండటంతో విక్రయదారులను తాను డబ్బులు తిరిగి ఇవ్వాలని మాత్రమే అడిగానన్నారు. మత్తడి పేల్చివేత ఘటనకు సంబంధించిన కేసు విచారణ జరుగుతుందన్నారు. కేసులో తనను అనవసరంగా ఇరికించేందుకు ప్రతిపక్ష పార్టీల నాయకులు కుట్రలు పన్నుతున్నారన్నారు.

బాల్క సుమన్ జన్మదిన వేడుకలు


మందమర్రి : ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న భారాసవి నాయకులు

బెల్లంపల్లి పట్టణం, చెన్నూరు న్యూస్‌టుడే : భారాస జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్ జన్మదిన వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు అందజేశారు. భారాసవి జిల్లా అధ్యక్షుడు శ్రావణ్, యువజన అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు. చెన్నూరు పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించుకున్నారు.

భీమారం, మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే : చెన్నూరు మాజీ శాసనసభ్యులు, భారాస జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ జన్మదిన వేడుకలు జైపూర్, భీమారం, మందమర్రి మండల కేంద్రాలలో భారాస పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు.

హద్దు రాళ్లు తొలగింపు


క్యాతనపల్లిలో హద్దురాళ్లను తొలగిస్తున్న సిబ్బంది

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : క్యాతనపల్లి పురపరిధిలోని భగత్‌సింగ్ నగర్ శివారులో అక్రమంగా ఏర్పాటు చేసిన హద్దురాళ్లను శుక్రవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. రెవెన్యూ, పురపాలిక సంయుక్తంగా చేపట్టిన కార్యక్రమంలో మందమర్రి తహసీల్దార్ సతీష్, పుర కమిషనర్ మురళీకృష్ణ పాల్గొన్నారు. అసైన్డ్ భూముల్లో ప్లాట్ల ఏర్పాటు సరికాదన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు.

ఎమ్మెల్యే పీఏ ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్

బెల్లంపల్లి పట్టణం : బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పీఏ గడ్డం ప్రసాద్ ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్ అయింది. ఆయన ఖాతా నుంచి డబ్బులు కావాలంటూ తెలిసిన వాళ్లకు ఇతరులకు సందేశాలు వెళ్లాయి. అనుమానం వచ్చిన వారంతా పీఏకు చరవాణి ద్వారా సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన పీఏ ప్రసాద్ తన ముఖచిత్ర ఖాతా హ్యాక్ అయినట్లు సామాజిక మాధ్యమాల ద్వారా అందిరికీ సమాచారం అందించారు.

సంక్షిప్తం

బాధ్యతల స్వీకరణ

మంచిర్యాలనేరవిభాగం : పట్టణ పోలీస్‌స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా ప్రమోద్‌రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఐటీ సెల్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన మంచిర్యాలకు బదిలీ అయిన విషయం తెలిసిందే.

భీమిని : మండల నూతన వ్యవసాయధికారిగా యమునా దుర్గ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా ఏఓ విజయ్ కుమార్ రెండు నెలల క్రితం బదిలీ కాగా వేమనపల్లి ఏఓ వీరన్న ఇన్‌ఛార్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. యమునా దుర్గ పూర్తిస్థాయి ఏఓగా బాధ్యతలు స్వీకరించారు.

కన్నెపల్లి: మండల వ్యవసాయాధికారిగా సాయి ప్రశాంత్ శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు భీమిని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ ఇన్‌ఛార్జిగా కొనసాగారు.

మంచిర్యాల న్యాయవిభాగం, నస్పూర్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా అర్పిత మారంరెడ్డి, అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా డాక్టర్ సి.సంపత్‌లు శుక్రవారం కోర్టులో బాధ్యతలు స్వీకరించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కాసిపేట : అక్షరాస్యత సాధిస్తే మహిళలు వ్యాపార రంగాల్లో రాణిస్తారని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ క్షేత్ర స్థాయి అధికారి సాయికృష్ణ అన్నారు. మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు.

వ్యక్తిత్వ వికాసంపై..

జన్నారం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డా.సునీల్ వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కరుణాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

దండేపల్లి : దండేపల్లి మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తాళ్లపేటకు చెందిన కంది సతీష్ తల్లి ఇటీవల మృతి చెందడంతో మంచిర్యాల ఎమ్మెల్యే కె.ప్రేమ్‌సాగర్‌రావు శుక్రవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్ తిరుపతి, మండల నాయకులు ఉన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి క్రీడా పోటీలు

వేమనపల్లి : నీల్వాయి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్-14 బాలికల జిల్లా స్థాయి ఖోఖో పోటీలను శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా సెక్రెటరీ ఫణిరాజా తెలిపారు.

సొంతింటి కల నెరవేర్చాలి

మందమర్రి పట్టణం : సింగరేణి కార్మికులు నివాసం ఉండే క్వార్టర్‌ను వారికే శాశ్వతంగా కేటాయించి సొంతింటి కలను సాకారం చేయాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మందమర్రి కేకే5 గనిపై మాట్లాడారు.

వినతులు

బెల్లంపల్లి పట్టణం : బెల్లంపల్లి పట్టణ కేంద్రంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా కన్వీనర్ జీవన్‌జోయల్ అన్నారు. ఈ విషయమై వారు శుక్రవారం బెల్లంపల్లి అటవీశాఖ రేంజర్ పూర్ణచందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

మంచిర్యాల పట్టణం : హాజీపూర్ మండలంలోని ముల్కల్లలో ర్యాలీవాగుపై వంతెన నిర్మించాలని కోరుతూ ఆ గ్రామస్తులు శుక్రవారం మంచిర్యాలలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు వినతి పత్రం అందజేశారు.

మంచిర్యాల సిటీ: పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాలు నిర్వహించాలని కోరుతూ శుక్రవారం రామగుండం కమిషనరేట్ సీపీ శ్రీనివాస్‌కు రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు కంకణాల భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి చందూరి మహేందర్ వినతిపత్రం అందజేశారు.

వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

భీమారం: దాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పత్తి, వరి పంట క్షేత్రాలను శుక్రవారం చెన్నూరు వ్యవసాయక సహాయక సంచాలకులు బానోత్ ప్రసాద్ పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి సుధాకర్, ఏఈవో అరుణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి

కన్నెపల్లి, న్యూస్‌టుడే : మహిళలు కుట్టు మిషన్‌లో నైపుణ్యం సాధించి స్వయం ఉపాధి పొందాలని జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్ అన్నారు. శుక్రవారం కన్నెపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో కుట్టు మిషన్‌లో నైపుణ్యం సాధించిన మహిళలకు ఏర్పాటు చేసిన మూల్యాంకన కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ నాణ్యత సమన్వయకర్త సత్యనారాయణ మూర్తితో కలిసి హాజరయ్యారు.

చెత్తను వేర్వేరుగా సేకరించాలి

మంచిర్యాల పట్టణం: తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు అన్నారు. హాజీపూర్ పంచాయతీలో శుక్రవారం మొబైల్ యాప్ ఇన్‌స్పెక్షన్ పని తీరును పరిశీలించారు.

ప్రయోగపూర్వకంగా చదివితే మరింత విజ్ఞానం

చెన్నూరు: ప్రయోగపూర్వకంగా చదువుకుంటే విద్యార్థుల్లో మరింత విజ్ఞానం పెరుగుతుందని జిజ్ఞాస సంచార ప్రయోగశాల నిర్వాహకులు సాయికుమార్, సంపత్ పేర్కొన్నారు. శుక్రవారం చెన్నూరు పట్టణంలోని ఎన్‌పీ వాడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ సంబంధిత అంశాలపై ప్రయోగపూర్వకంగా అవగాహన కల్పించారు.

ఎంబీబీఎస్ సీటు సాధించడం గర్వకారణం

జన్నారం, న్యూస్‌టుడే : మండలంలోని చింతగూప గ్రామానికి చెందిన సిరినేని రాహుల్ ఎంబీబీఎస్ సీటు సాధించడం గర్వకారణమని పద్మశాలి సంఘం నాయకులు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రాహుల్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు కళావతి-శివసాగర్‌ను సన్మానించారు.

రాత పుస్తకాలు అందజేత



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

తాండూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు దాతల సహాయ సహకారాలను సద్వినియోగపర్చుకోవాలని హైదరాబాద్ హెల్పింగ్ సొసైటీ ఫౌండేషన్ సభ్యులు అన్నారు. శుక్రవారం తాండూరు మండలం అచ్చలాపూర్ కాంప్లెక్స్ పరిధిలోని గోపాల్‌నగర్, గంపలపల్లి, అన్నారం, బారెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.